
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 97 వ భాగం

## అవతార వైభవం

సృష్టి ఎలా ఏర్పడిందో దాని లోంచి మొత్తం విశ్వం ఎలా పుట్టిందనేది, బ్రహ్మ వివరించాక ఇప్పుడు భగవంతుడి అవతారాలు ఎలా వచ్చాయి, అనేవి చెప్తున్నాడు. అయితే మంచి కోసం విశ్వంలో జగత్తు పుడితే ధర్మం ఎప్పుడూ ఒకలాగే ఉండాలి కదా? ధర్మం ఎప్పుడూ ఒకలాగే ఉండి ప్రజలంతా సంతోషంగా ఉంటే అసలు భగవంతుడు అవతారం ఎత్తడం ఎందుకూ, ధర్మ రక్షణ ఎందుకూ? దానికి సమాధానం ఏమంటే, జగత్తు సృష్టించాక జరిగిన సృష్టిలో ప్రతీ వారికీ మంచి చేయడానికీ, చెడు చేయడానికీ స్వతంత్రం కల్పించారు. దాని ప్రకారం అహంకారం వల్ల ఒకరి కంటే మరొకరు ఎక్కువా తక్కువా అనే స్పర్ధలు మొదలయ్యాక వాటినుంచి దెబ్బలాటలూ, కొట్టుకోవడం, చంపుకోవడం, పాపం, పుణ్యం, కర్మ మన వెంట రావడం అన్నీ మొదలయ్యాయన్నమాట. ఎప్పుడైతే చెడు ఎక్కువైందో అది అణచడానికి మానవ మాత్రులకి సాధ్యం కానపుడు భగవంతుడి తప్పలేదు. అసలీ అవతారం ఎందుకు ధరించాలి, చెడు ఎక్కువైతే, ఒకర్నొకరు చంపుకుంటుంటే ఆయనకేమిటి నష్టం? అలాకాదు, మొత్తం విశ్వం అంతా ఆయన లీల ప్రకారం జరుగుతూ ఉంటుంది. అందుకే విశ్వం అవిర్భవించడం, లయం అవడం మళ్ళీ అవిర్భావం జరగడం ఎందుకంటే ఇదంతా పరమేశ్వర విలాసం అంటారు. దీన్నే పోతన తన వచనంలో భగవంతుడి రూపు వర్ణిస్తూ, 'రెప్పలు అహోరాత్రంబులు' అంటాడు. ఈ విశ్వం అంతా భగవంతుడి కనురెప్పపాటు కాలంలో సృష్టిలో ఉంటుంది, ఆ రెప్పలు మూస్తే విలయం.

ఉ. అన్య కథానులాపము లహర్నిశమున్ వినునట్టి సత్క్రియా
శూన్యములైన కర్ణముల సూరిజనస్తుత సర్వలోక స
మ్మాన్యమునై తనర్చు హరిమంగళదివ్యకథామృతంబు సౌ
జన్యతఁ గ్రోలవయ్య బుధసత్తమ! యే వివరించి చెప్పెదన్. [2-113]

ఎల్లకాలం ఏవేవో కథలూ ప్రసంగాలూ వింటూ ఏమాత్రం పుణ్య కథలు విననట్టి చెవులకి విష్ణుకథలు విందు చేస్తాయి. విష్ణుకథలు కళ్యాణాత్మకాలు అనడం అంటే ఇదే.

మ. కనకాక్షుండు భుజావిజృంభణమునన్ క్ష్మాచక్రముం జాపఁ జు
ట్టిన మాడ్కిం గొనిపోవ, యజ్ఞమయ దంష్ట్రిస్వాకృతిం దాల్చి య
ద్దనుజాధీశ్వరుఁ దాఁకి యబ్ధి నడుమన్ దంష్ట్రాహతిం ద్రుంప ధా
త్రిని గూలెం గులిశాహతింబడు మహాద్రిం బోలి యత్యుగ్రతన్. [2-115]

పూర్వం హిరణ్యాక్షుడు (కనకాక్షుండు) భుజ బలంతో భూమిని (క్ష్మాచక్రంబునన్) చాపలా చుట్టేసి తీసుకుపోయాడు. అప్పుడు భగవంతుడు యజ్ఞవరాహరూపం ధరించి ఆ రాక్షసుడితో (దనుజాధీశ్వరు) సముద్రంలో (అబ్ధి నడుమన్) సంహరించాడు. వాడు వజ్రాయుధం (కులిశ) వల్ల కిందపడిన కొండలాగా (మహాద్రిం) కూలిపోయాడు. ఈ కథ కిందటి వ్యాసాల్లో చూసాం. ఈ చాపలా చుట్టడం సంగతి మరోసారి. భూమి గుండ్రంగా ఉందని మన ఋషులకీ వాళ్ళకీ ఏనాడో తెలుసు కదా అయితే చాపలా చుట్టడం ఏమిటనేది చూద్దాం. ఏదో విధంగా భూమిలాంటి గ్రహాన్ని పట్టుకుని కక్ష్యలోంచి తప్పించాడు హిరణ్యాక్షుడనేవాడు. అప్పుడా భూమి అనే గ్రహం విశ్వంలో దారీ తెన్నూ లేకుండా కొట్టుకుపోతూంటే దాన్ని తీసి మన సూర్యుడి కక్ష్యలో ప్రవేశపెట్టాడు. అలా మన మనుగడ బాగుపడింది. అర్రెర్రే ఇవన్నీ ఎలా జరుగుతాయ్, అంత బలం ఉన్నవాడెవడూ అనే ప్రశ్నలు వస్తే ఒకటే సమాధానం. భగవంతుడు అనేవాడున్నాడు అని ఆయన ఏదైనా చేయగలడు అని ఒప్పుకుంటే, ఏదైనా సాధ్యం. దీనికి సమాధానం కూడా ముందు వ్యాసాల్లో చూసాం. మొదట్లోనే అన్నింటికీ సమాధానాలు రావు. మూడో తరగతి చదువుతున్నప్పుడు ఫలానా కలన గణితం లో సూత్రం ఇది అని చెప్పారనుకోండి. మూడో తరగతి చదువునేవాళ్లు ఏమంటారు? వాళ్లకేం అర్ధమౌతుంది? అందువల్ల మన స్థాయిలోంచి చూసి ఏదీ ఇదంతా ఎలా జరుగుతుందీ అంటే చెప్పలేం. అదే రమణుల, రామకృష్ణుల స్థాయి మనకి వచ్చాక (అసలంటూ వస్తేనే లెండి) అప్పుడు ఇదంతా అర్ధం అవ్వచ్చు. అందుకే ఆత్మసందర్శనం కోసం మొదటగా ఎక్కాల్సిన మెట్టు 'భగవంతుడనేవాడు ఉన్నాడ'నే నమ్మకం. అదే లేకపోతే అసలు ఆత్మసందర్శనం కోసం, బ్రహ్మాన్ని తెలుసుకోవడం కోసం ప్రయత్నం చేయడమే శుద్ధ దండగ.

సీ. ప్రకట రుచిప్రజాపతికిని స్వాయంభు
వుని కూఁతు రాకూతి యను లతాంగి

కర్థి జన్మించి సుయజ్ఞుండు నానొప్పు
నతఁడు దక్షిణ యను నతివయందు
సుయమ నా మామరస్తోమంబుఁ బుట్టించి
యింద్రుఁడై వెలసి యుపేంద్ర లీల
నఖిల లోకంబుల యార్తి హరించిన
నతని మాతామహుండైన మనువు [2-117]

తే. తన మనంబునఁ దచ్చరిత్రమున కలరి
పరమపుణ్యుండు హరి యని పలికెఁ గాన
నంచితజ్ఞాననిధి యై సుయజ్ఞుఁ డెలమిఁ
దాపసోత్తమ! హరి యవతారమయ్యె. [2-117.1]

ఈ పద్యం సుయజ్ఞోవతారం కథ గురించి. పూరం రుచి అనే ప్రజాపతికి స్వాయంభువ మనువు కూతురైన ఆకూతి అనే ఆవిడ వల్ల సుయజ్ఞుడు పుట్టాడు. ఆయనకి దక్షిణ అనే అవిడ వల్ల సుయములు అనేవారు పుట్టారు. సుయజ్ఞుడు ఇంద్రుడై విష్ణువులాగా లోకాలలో దుఃఖాన్నీ (ఆర్తి) హరింపచేశాడు. అందువల్ల మనువు తన మనవడి చరిత్రకి ఉప్పొంగి ఈయన సాక్షాత్తూ శ్రీహరే అని ప్రశస్తించాడు. ఇందులో విష్ణువుని పోతన ఉపేంద్రుడు అన్నాడు చూసారా? ఉపేంద్రుడంటే, ఇంద్రుడికి తమ్ముడు. వామనావతారంలో శ్రీహరి అదితి కడుపున ఇంద్రుడికి తమ్ముడిగా పుట్టాడు కదా? ఇదే మనం రోజూ చదివే మంత్రాలలో కూడా చూడవచ్చు – .... గోవిందాయనమః ... త్రివిక్రమాయనమః ....నారసింహాయనమః, అచ్యుతాయనమః, ఉపేంద్రాయనమః, హరయే, శ్రీకృష్ణాయనమః...”

వ. అని చెప్పి సాంఖ్యయోగ ప్రవర్తకాచార్యవర్యుం డగు కపిలుని యవతారంబు విను"మని యిట్లనియె. [2-118]

చ. ధృతమతి దేవహూతికిని దివ్యవిభుండగు కర్దమప్రజా
పతికిఁ బ్రమోద మొప్ప నవభామలతోఁ గపిలాఖ్యుఁ బుట్టి యే
గతి హరి పొందునట్టి సుభగంబగు సాంఖ్యము దల్లి కిచ్చి దు
ష్కృతములువాపి చూపె మునిసేవితమై తనరారు మోక్షమున్. [2-119]

నిశ్చలమైన మనస్సున్న దేవహూతికి కర్దమ ప్రజాపతి వల్ల తొమ్మిదిమంది కూతుర్లు (నవభామలు) పుట్టాక కపిలుడనే పేరుతో శ్రీహరి పుట్టాడు. ఏ యోగంతో అయితే భగవంతుణ్ణి చేరడం సులభమో ఆ సాంఖ్య యోగాన్ని తల్లికి బోధించాడు. దానివల్ల తన తల్లి పాపాలు పోగొట్టి మోక్షం అందుకునేలా చేశాడు.  ఓ విషయం గమనించండి ఇక్కడ. బ్రహ్మ నారదుడికి వివరించి చెప్పే అవతారాలలో దశావతారాలు అన్నీ ఉండవచ్చు లేకపోవచ్చు ఎందుకంటే దశావతారాలనేవి  మనం తేలిగ్గా గుర్తుపెట్టుకునేవి. మహాభాగవతంలో దశావతారాలు కాక మిగతావి చాలా ఉన్నాయి. అయితే అవతారాలు మొత్తం ఎన్ని అంటే లెక్కగా చెప్పడం కష్టం, అనవసరం కూడా. అసలు భగవంతుడి అవతారం ఎందుకొస్తుందనేదానికి కృష్ణుడు భగవద్గీతలో చెప్పినది గుర్తుంటే చాలు – యదా యదాహి ధర్మస్య, గ్లానిర్భవతి భారత.. అనేది.

సీ. తాపసోత్తముఁ డత్రి తనయునిఁ గోరి ర
మేశు వేఁడిన హరి యేను నీకు
ననఘ దత్తుడనైతి నని పల్కు కతమున
నతఁడు దత్తాత్రేయుఁడై జనించె
నమ్మహాత్ముని చరణాబ్జ పరాగ సం
దోహంబుచేఁ బూతదేహు లగుచు
హైహయ యదు వంశ్యు లైహికాముష్మిక
ఫలరూప మగు యోగబలము వడసి [2-121]

తే. సంచితజ్ఞానఫల సుఖైశ్వర్య శక్తి
శౌర్యములఁ బొంది తమ కీర్తి చదల వెలుఁగ
నిందు నందును వాసికి నెక్కి; రట్టి
దివ్యతర మూర్తి విష్ణు నుతింపఁ దరమె? [2-121.1]

అత్రి మహర్షి కొడుకు కోసం శ్రీహరిని ప్రార్ధించేసరికి ఆయన కనిపించి 'నేను నీకు దత్తుడిని అయ్యాను' అన్నాడు. అందువల్ల ఆయనే దత్తాత్రేయుడిగా అవతరించాడు. అనేక వంశాలవారు ఆయన ఇచ్చిన గురూపదేశం వల్ల ఇహపరాలు

సాధించుకునే యోగబలం సంపాదించుకున్నారు. అటువంటి భగవంతుణ్ణి పొగడడం సాధ్యమేనా? దత్తాత్రేయుడే యోగబలానికి ఆద్యుడు కనక ఆదిగురువు అనడం కూడా మనం చూస్తాం.

సీ. అనఘాత్మ! యేను గల్పాదిని విశ్వంబు
సృజియింపఁ దలఁచి యంచిత తపంబు
నర్థిఁ జేయుచు సన యని పల్కుటయు నది
కారణంబుగ సనాఖ్యలనుగల స
నందన సనక సనత్కుమార సనత్సు
జాతులు నల్వురు సంభవించి
మానసపుత్రులై మహి నుతికెక్కిరి
పోయిన కల్పాంతమున నశించి [2-123]

తే. నట్టి యాత్మీయతత్త్వంబు పుట్టఁ జేసి
సంప్రదాయక భంగిని జగతి నెల్ల
గలుగఁ జేసిరి యవ్విష్ణుకళలఁ దనరి
నలువు రయ్యును నొక్కఁడ నయచరిత్ర! [2-123.1]

ఇప్పుడు చెప్పబోయే అవతారం సనక సనందనాదుల గురించి. సృష్ట్యాదిలో బ్రహ్మ నిద్రలోంచి లేచి తపస్సు చేస్తూ 'సన' అనేసరికి సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతీయులనే నలుగురు పిల్లలు పుట్టారు. వీళ్ళు బ్రహ్మ మనసులోంచి ఉద్భవించారు కనక మానస పుతృలయ్యారు. బ్రహ్మ పడుకున్నప్పుడు కల్పాంతం అయింది కనక ఆ నశించిన కల్పంలో ఆత్మ తత్త్వాన్ని ఈ నలుగురూ జగత్తులో తిరిగి ప్రచారం చేసారు. మరోవిధంగా మనం కథ చదువుతాం కూడా. వీళ్లకి పుట్టగానే జ్ఞానోదయం అయింది — ఈ సంసారం వల్ల పెద్దగా ప్రయోజనం ఏమీ ఉండదని. సంసారం అంటే పుట్టడం, చావడం అనే ఎప్పటికీ తెగని చక్రం. అందువల్ల వాళ్ళు భగవంతుడికి జీవితం కైంకర్యం చేసారు. అలా చేసినందువల్ల వాళ్ళే భగవంతుడి అవతారం.

క. గణుతింపఁగ నరనారా
యణు లన ధర్మునకు నుదయ మందిరి; దాక్షా
యణియైన మూర్తి వలనం
బ్రణుతగుణోత్తరులు పరమపావనమూర్తుల్. [2-125]

దక్షప్రజాపతి కూతురైన మూర్తి అనే ఆవిడని ధర్ముడు వివాహం చేసుకున్నప్పుడు నర, నారాయణులు పుట్టారు. వీళ్ళు పరమ పుణ్యమూర్తులు. భాగవతం ప్రకారం దక్షప్రజాపతి కి పుట్టిన కొడుకులనందర్నీ నారదుడు ముక్తి మార్గం లో పెట్టాడనీ అందువల్ల దక్షుడు నారదుణ్ణి శపించి కూతుర్లని కన్నాడనీ క్రితం వ్యాసాల్లో చదివాం. అలా మొత్తం సృష్టి అంతటికీ కారకుడు ఈ దక్ష ప్రజాపతే. ఆయన కూతుర్లకి పుట్టినవారే చరాచర ప్రపంచంలో ప్రాణులన్నీ. నరనారాయణుల జననం సహస్రకవచుడు అనేవాణ్ణి చంపడానికి జరిగింది అనే కథ వేరే. ఈ నరనారాయణుల కథ వచ్చేనెల వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS